అజయ్ ఘోష్‌ను పరామర్శించిన కంకణాల

విశాలాంధ్ర-మంగళగిరి : సినీ నటుడు అజయ్ ఘోష్‌ను జనసేన నాయకుడు కంకణాల శంకర్ పరా మర్శించారు. ఇటీవల అధిక ఉష్ణోగ్ర తల నేపథ్యంలో అజయ్ ఘోష్ మాతృమూర్తి మృతి చెందారు. బాపట్ల జిల్లా, వేటపాలెంలోని ఆయన నివాసంలో కంకణాల శంకర్ ఆదివారం కలిసి పరామర్శించారు. నాయకులు సురేష్, హనుమంతరావు, రేవంత్, కె.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో బీఆర్ఎస్ పెట్టే అర్హత కేసీఆర్‌కు లేదు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పెట్టే అర్హత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేదని వైసీపీ సీనియర్ నాయకురాలు, ఏపీ సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏపీని రెండు ముక్కలు చేసిన కేసీఆర్ ఆంధ్ర ద్రోహి అని దుయ్యబట్టారు. ఏపీలో కేసీఆర్ అడుగు పెడితే వారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని, అవసమైతే తగులబెడతామని హెచ్చరించారు.

పుల్లేశ్వరరావు మాష్టారుకు నివాళి

విశాలాంధ్ర- మంగళగిరి : జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు మాష్టారు ఆదివారం మృతి చెందారు. ఆయన పార్థీవదేశానికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ఘనంగా నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర-మంగళగిరి : నగర పరిధిలోని కాంగ్రెస్ పార్టీ

కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సభను కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ దేశవ్యాప్తంగా తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. అలాగే యువతి యువకులకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించారని, పేద బడుగు బలహీన వర్గా లకు అండగా నిలబడిన నేత రాజీవ్ అని కొనియాడారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించి 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో రేయమనిశెట్టి హనుమంతరావు, పటాన్ సుభాని, షేక్ జాన్, గోలి సాంబశివరావు కొడగంటి చిక్కయ్య, షేక్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్కాలర్‌షిప్ పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పారిశ్రామిక వేత్త, భువనేశ్వరి

అగ్రి టెక్ చైర్మన్ ఏలూరి ప్రసాద్ రావు జన్మదినం సందర్భంగా పదవ తరగతి, ఇంటర్ పరీక్షలలో మెరిట్ సాధించిన విద్యార్థినులకు స్థానిక శ్యామలానగర్‌లోని ఆయన కార్యాలయంలో స్కాలర్ షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మారు తున్న విద్యావిధానానికి అనుగుణంగా విషయపరిజ్ఞానంతో రాణిం చాలని సూచించారు. భవిష్యత్‌లో మరింత ఏకాగ్రతతో రాణించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కొనియాడారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, సొపాటి రత్నం, శ్రీను నాయక్‌లతో కలిసి కేకు కోసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బదిలీల్లో వెసులుబాటుపై ప్రభుత్వం పునరాలోచించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉద్యోగుల హక్కుల కోసం రోడ్డు పైకి వచ్చి ఉద్యమాలు చేద్దామని సంఘాల నాయకులు ప్రభుత్వానికి అల్టిమేటం ఇస్తున్న సందర్భంలో ప్రభుత్వం సంఘాల నాయకులకు బదిలీల్లో వెసులుబాటు ఇవ్వడం ఎంతవరకు సబబు అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగుల హక్కులు కాపాడాల్సిన నాయకులు స్వప్రయోజనాల కోసం ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకుని ఎవరికి వారుగా విడిపోయి సాధించాల్సిన లక్ష్యాలను మరిచారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి నాయకులకు బదిలీల్లో వెసులుబాటు నివ్వటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఉద్యోగులందరినీ ఒకేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల హక్కులు సాధింలేక సతికలబడ్డ సంఘాల నాయకులకు బదిలీల్లో వెసులుబాటు నివ్వటం మిగతా ఉద్యోగులను చులకనగా చూసే పరిస్థితి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంఘాల నాయకులకు నైతిక బాధ్యత ఉంటే ఈ బదిలీలలో వెసులుబాటు నుంచి వైదొలుగున్నట్లు ప్రకటించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన హితవుపలికారు.

పదోన్నతుల గందరగోళాన్ని నివారించండి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపైన ఉండే గందరగోళాన్ని తక్షణం నివారించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు కంకరగుంట వద్ద గల ఎస్టీయూ భవన్‌లో ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీపైన సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సుధీర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపైన మీనమేషాలు లెక్క వేస్తూ ఉత్తుత్తి పదోన్న తులతో ఉపాధ్యాయులను మోసం చేస్తున్నదని, దీనివల్ల విద్యా రంగం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత జనవరిలో రూ.2500లతో పని సర్దుబాటు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 5000 మంది ఉపాధ్యాయులతో నాలుగు నెలలు వెట్టిచాకిరి చేయించుకున్నారని, ఇంతవరకు వారికి రావలసిన రూ.2500లు చెల్లించలేదని విమర్శించారు. గత నాలుగు నెలలుగా పని సర్దుబాటు పేరుతో 30 శాతం కోటా కింద వెళ్లిన ఉపాధ్యాయులు ఇప్పుడు పదో న్నతులు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్ పదోన్నతుల విషయంలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు సర్వీస్ నిబంధనల మేరకు ఇవ్వకుండా కేవలం ఒక ఇంక్రిమెంట్‌తో నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు మాట్లా డుతూ బదిలీల విషయంలో ప్రభుత్వం ఉపాధ్యాయులం దరికీ న్యాయం జరిగే విధంగా సమగ్రమైన ఉత్తర్వులు రూపొందించాలని, అన్ని రకాల ప్రాధన్యత క్రమాలు, దీర్ఘకాలిక వ్యాధులు, ప్రత్యేక పాయింట్లు, కొనసాగించా లని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా 34 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామన్న ప్రభుత్వం, ఎన్నికలయ్యాక మాట తప్పిందని కేవలం 4వేల మందికి మాత్రమే అని చెప్పడాన్ని ఖండిస్తున్నామని తెలియజేశారు. జిల్లాస్థాయిలో అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో సమ న్వయ సమావేశం నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని, పదోన్నతులు విషయంలో ఒకే విధానం అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్య క్షులు డి.పెదబాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటే శ్వరరావు, సీనియర్ నాయకులు కమతం శ్రీనివాసరావు, డీపీ జోసెఫ్, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ షేక్ బాజీ, పేరేచర్ల శ్రీనివాసరావు, మార్పు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలల యాన్వల్ గ్రాంట్ రెట్టింపు చేసి విడుదల చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలలకు చెల్లించే యాన్వల్ గ్రాంట్ రెంటింపు చేసి పాఠశాలల ప్రారంభంకు ముందే విడుదల చేయాలని ఏపీ టీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మహమ్మద్ ఖాలీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కన్నవారితోటలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యా యుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక్కొక్క పాఠశా లకు స్కూల్ గ్రాంట్ రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు రావాల్సి ఉందని కానీ గత విద్యా సంవత్సరంలో మొత్తంలో 20 శాతం వంతున రెండు సార్లు విడుదల చేశారని వాటిని కూడా ప్రధానోపాధ్యాయులు సమ యంలో డ్రా చేసుకోలేకపోయారన్నారు. ప్రస్తుతం ప్రభు త్వం అన్ని తరగతులకు విద్యుదీకరణ చేపట్టి విద్యార్థులకు ఫ్యాన్స్, నీటి పంపులు, తాగునీరు(మినరల్ వాటర్) డిజిటల్ తరగతులు, కంప్యూటర్స్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు కొత్తగా అత్యంత ఆధునీకరణ ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డ్స్ ఇవ్వబోతున్నారన్నారు. ఆధునిక వసతులు కల్పిస్తు న్నప్పటికీ వీటన్నిటితో విద్యుత్ వినియోగం ఇబ్బడి ముబ్బ డిగా పెరిగిపోతున్నదన్నారు. అన్ని వాడితో ప్రతి పాఠశా లకు నెలకు రూ.5 నుంచి రూ.8 వేల పైనే విద్యుత్ బిల్లు లు వస్తున్నాయన్నారు. నిధులు విడుదల కాక, విడుదలైన 20 శాతం సరిపోక ప్రధానోపాధ్యాయులు వీటిని వినియో గించకుండా నిలుపుదల చేస్తున్నారన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లింపులు పాఠశాలలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, పి.నాగశివన్నారాయణ, టి.శ్రీనివాస్, డి.శివ శంకరరావు, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, మహమ్మద్ ఖుద్దుస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ

విశాలాంధ్ర-గుంటూరు : దేశంలో సాంకేతిక, టెలి కమ్యూనికేషన్స్ విప్లవం తీసుకురావడంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన కృషి మరువలేనిదని డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ అన్నారు. ఆయన వర్ధంతిని గుంటూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహిళా సాధికారత, లింగ సమానత్వం కోసం రాజీవ్ విశేష కృషి జరిపారన్నారు. విద్య సంస్కరణలు తీసుకువచ్చి మంచి విద్యను అందించిన గొప్ప మహానుభావుడు అని కొనియాడారు. దేశ రక్షణను బలోపేతం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. వణుకూరి శ్రీని వాస్ రెడ్డి, గడ్డం పాల్ విజయ్ కుమార్, అంబటి రత్తయ్య, వెంకటరెడ్డి, మద్ది శ్రీనివాస్, సయ్య ద్ జాని, సుంకర నాని, సుధీర్ బాబు, బిల్లా సునీల్, వాల్మీకి శ్రీనివాస్, మల్లవరపు చిన్న, బోడపాటి శ్రీను, ఎండీ ఉస్మాన్, షేక్ గౌస్, భాగ్యరాజ్, పాకనాటి నరేష్, రాము, షేక్ రెహ మాన్, బుజ్జి, మెహబూబ్, షేక్ రఫీ, వసంత కుమార్, మాల్యాద్రి, శ్రీను పాల్గొన్నారు.

ఫాదర్ కిషోర్‌బాబు సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: బాలయేసు కథెడ్రల్ దేవాలయ విచారణ గురువులు రెవ.ఫా.చొప్పర కిషోర్‌బాబు సేవలు ప్రసంశనీయమని బాల యేసు కథెడ్రల్ దేవాలయ విచారణ గురువులు డా.రెవ.ఫా. పామిశెట్టి బాలస్వామి కొని యాడారు. గత మూడు సంవత్సరాలు బాలయేసు దేవాలయ భక్తులకు భక్తి భావంతో కూడిన దైవ సేవా కార్యక్రమాలు అందించి అందరి మన్ననలు పొందిన ఫాదర్ కిషోర్‌బాబు సేవలు మరువలేనివని ఆదివారం దేవాలయంలో జరిగిప పూజా కార్యక్రమంలో భక్తులకు గుర్తు చేశారు. అనంతరం గుంటూరు పీఠాధిపతులు రైట్. రెవ.డా.చిన్నాబత్తిని భాగ్యయ్య ఉత్తర్వుల మేరకు దేవాలయంలో సహాయ గురువుగా 3సంవత్సరాలు సేవలందించి మేడికొండూరు మండలం పేరేచర్లలో యూనివర్సల్ కళాశాలకు బదిలీపై వెళ్తున్న ఫాదర్ కిషోర్‌బాబుకు విచారణ గురువులు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసిన అనంతరం దేవాలయ కమిటీ సభ్యులతో పాటు, ఫిరంగిపురం గ్రామంలో వివిధ ప్రాంతాలకు చెందిన మరియదళ సభ్యులు కిషోర్‌బాబును చాలువాలు కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫాదర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ దేవాలయంలో తన 3సంవత్సరాలు సేవా కార్యక్రమాల్లో తనను ఆదరించిన ఫాదర్ బాలస్వామితో పాటు భక్తులకు అందరికి కృతజ్ఞతాభినందనలు చెప్పారు.

కూచిపూడిలో రాణిస్తున్న గ్రీష్మ, తహసీన్

సంప్రదాయ కళకు ప్రాణం పోస్తున్న చిన్నారులు

విశాలాంధ్ర-తెనాలి : రాజులు పోయారు... రాజరికపు వ్యవస్థ పోయింది... రాజుగారి కొలువు కనిపించడం లేదు... రాజనర్తకిల ఆచూకీ కనుమరుగైంది... నాట్య ప్రదర్శన చూసి భళా అని మెచ్చుకుంటూ బహుమతులు ఇచ్చే చేతులూ కనిపించడం లేదు... వెరసి సాంప్రదాయ కళలు అంతరించి పోతున్నాయి. కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శనలకు ఆదరణ ఆమడదూరంలో ఉంది. మరుగునపడిపోతున్న భారతీయ సాంప్రదాయ కళలను విడిచి పెట్టకుండా ఇంకా వెలాడుతూ ఉండేవారు అరు దుగా ఉన్నారని ఖచ్చితంగా చెప్పగలం. ఆ కోవలోనే వికసించిన చిన్నారులు గ్రీష్మ, తహసీన్. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చిన్నారులు గ్రీష్మ, తహసీన్‌లు కూచిపూడి నృత్యంలో రాణిస్తున్నారు. ఏడు సంవత్సరాల గ్రీష్మ రెండో తరగతి చదువుతోంది. తండ్రి కృష్ణారెడ్డి ఇక్కడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తు న్నారు. తల్లి అరుణ కుమారి పట్టువదలని విక్రమార్కుడిలా గ్రీష్మతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిరాటంకంగా చేపిస్తూనే ఉన్నారు. గ్రీష్మంలోని మండే ఎండల్లో కూడా తన కూతురు గ్రీష్మతో నృత్య ప్రదర్శనలు చేపిస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి భరత నాట్యం, కూచి పూడి నృత్యాలను వేలాదిమందికి నేర్పిస్తూ కళా సేవలో కొనసాగుతున్న నిర్మల రమేష్ ఈ చిన్నారులిద్దరికి గురువు కావడం విశేషం. గురువు నిర్మలా రమేష్ వద్ద భరత నాట్యం, కూచిపూడి నేర్చుకున్న ఎందరో విద్యార్థులు ఇతర దేశాల్లో సహా ప్రదర్శనలిచ్చి నిర్మలా రమేషా మజాకానా అనే స్థాయిని ఆమె సొంతం చేసుకున్నారు. గత మూడేళ్లుగా నిర్మలా రమేష్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న గ్రీష్మ దాదాపు వందకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ చిన్నారి గ్రీష్మ ప్రదర్శనలు ఇచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువు సుశిక్షణా తనకు అడుగులు నేర్పించారని చిన్నారి గ్రీష్మ చెప్పింది. ఏడెళ్లకే నాట్యకళ ఎవరెస్ట్ ఎక్కాలని అకుంఠిత దీక్ష పట్టుదలతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్న చిన్నారి గ్రీష్మ 'బాల కళారత్న' అవార్డును అందుకుంది. ఏదైనా పాట వినిపిస్తే దానికి అణుగుణంగా స్టెప్పులు వేస్తున్న గ్రీష్మలోని అభిరుచిని గమనించిన అమ్మ అరుణ కుమారి, తండ్రి కృష్ణారెడ్డి నాట్య గురువు నిర్మలా రమేష్ దగ్గర శిక్షణ కోసం పంపారు. అక్కడనుంచి చదువుకు దుమ్మా కొట్టకుండా నాట్యం అడుగులు వేస్తూ కొనసాగిస్తుంది గ్రీష్మ.

ఇక షేక్ తహసీన్ పుట్టుకతో ముస్లిం అయినప్పటి తల్లి ఆలియా పట్టుదలతో భారతీయ సాంప్రదాయ కళలపట్ల గౌరవంతో తహసీన్‌ను కూడా గురువు నిర్మలా రమేష్ దగ్గరకే శిక్షణ కోసం పంపారు. తహసీన్ తండ్రి షేక్ రఫీ వ్యాపారస్తుడు కావడంతో కూతురుకు కావలసిన సౌకర్యా లను ఏర్పాటు చేశారు. దీంతో తహసీన్ నాన్ స్టాప్ ఎక్స్‌ప్రెస్ మాదిరిగా ముందుకు దూసుకుపోతుంది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతూ కూచిపూడి క్లాసికల్ డాన్స్‌ను కుమ్మి పారేస్తుంది.

తహసీన్ తల్లి ఆలియా తనబిడ్డ బాగా ఎదగాలనే కృతనిశ్చయంతో స్కూటీ కొనుక్కుని మరీ బిడ్డను ఎక్కించుకుని కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేపిస్తున్నారు. అపుడెప్పుడో ముత్యాల ముగ్గు సినిమాలో 'మడిసన్నాక కూసంత కళా పోషణ ఉండోద్దూ' అనే డైలాగ్ గుర్తుకువస్తుంది ఈ చిన్నారులు గ్రీష్మ, తహసీన్‌ల కళా సాధన చూస్తుంటే! ఏది ఏమైనా అంతరించిపోతున్న భారతీయ సాంప్రదాయ కళలు చిరంజీవిగా కొనసాగేలా కృషి చేస్తున్న గ్రీష్మ, తహసీన్‌లు అభినందనీయులు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సాహితీ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు : సుదీర్ఘకాలంగా వర్ధమాన రచయితలను ప్రోత్సహిస్తూ సామాజిక అంశాలపై ప్రాంతాలకతీతంగా సాహితీ సేద్యం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సేవలు ప్రశంసనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన గ్రంథాలయ సందర్శనలో భాగంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర ఆదివారం నిర్వహించారు. అన్నమయ్య గ్రంథాలయ ప్రాసస్యాన్ని తెలుసుకొని తాళపత్ర, విలువైన గ్రంథాలను పరిశీలించారు. అనంతరం ధార్మిక విజ్ఞాన ప్రాంగణంలో 'మన ఆంధ్రప్రదేశ్ కవితా సంకలనం', 'విత్తనం హై కు సంపుటి' పుస్తకాలావిష్కరణ సభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ రచయితలు కన్నతల్లి, పుట్టిన నేల, రుణాలు తీర్చుకునేలా స్వాభిమానం దెబ్బతినకుండా తమ రచనలు చేయాలన్నారు. సామాజిక స్పృహతో సత్యాన్ని, యదార్థతలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ సమ్మిళిత దృక్పథంతో వ్రాయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రచయితలకు కావలసిన అంశాలు గ్రంథ భాండాగారాలలో సాహిత్య సౌరభాల తోటలు విరబూస్తుంటాయని తెలియజేశారు. ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి అన్నమయ్య గ్రంథాలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రూపశిల్పి లంకా సూర్యనారాయణను ఘనంగా సత్కరించారు. తొలుత తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, నెల్లూరు అధ్యక్షులు జయప్రకాష్, జనని సంస్థ చెన్నై ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, సాహితీవేత్త లలితానంద్, డాక్టర్ ఉప్పల దడియం వెంకటేశ్వర, రాష్ట్ర కార్యదర్శి చలపాక ప్రకాష్, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

కొల్లి నాగేశ్వరరావుకు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు : రైతుల కోసం కొల్లి నాగేశ్వరరావు చేసిన పోరాటాలు, త్యాగాలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీలు అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని రైతు సంఘం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కొల్లి నాగేశ్వరరావు తృతీయ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రంగారెడ్డి, శివాజీలు మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు తన జీవితం ఆఖరి వరకు రైతుల కోసం పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. నిరాడంబరత జీవితం గడిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కంజుల విఠల్ రెడ్డి, జగన్నాథం, మేడా హనుమంతరావు, వి.రాధాకృష్ణమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకులు నాసర్ జీ, బి.యశ్వంత్ శశి, సాయి అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-మేడికొండూరు : సెంటర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడికొండూరు మండలం భీమినేనివారి పాలెం గ్రామానికి చెందిన ప్యాసింజర్ ఆటో పేరేచర్ల నుంచి భీమినేనివారిపాలెం గ్రామం వెళుతున్న క్రమంలో మేడికొండూరు యూనియన్ బ్యాంక్ ఎదురుగా హైదరాబాద్ నుంచి గుంటూరు వెళుతున్న కారును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న శ్రీరాం రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న సయ్యద్ ఇబ్రహీం, పాలెపోగు దేవ సహాయం స్వల్ప గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం స్థానికులు 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం ఇరుకు రోడ్డు కావడంతో రెండు గంటలపైగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలను ఏం ఉద్ధరించారు..?

- జనగణనతోనే బీసీ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- జోన్-3 బీసీ నేతల రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-గుంటూరు : సామాజిక న్యాయం జపించే జగన్ రెడ్డి గత నాలుగేళ్లలో బీసీలను ఏం ఉద్ధరించారని జోన్-3 బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ప్రశ్నించారు. సామాజిక న్యాయం ముసుగులో సామాజిక విద్రోహానికి జగన్ రెడ్డి పాల్పడుతున్నారని, నాలుగు సంవత్సరాల పాలనంతా బీసీలను అణగదొక్కడం, అక్రమ కేసులు పెట్టడం, హత్యలు చేయడం దిశగానే సాగిందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు కుదించి, సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించి, కార్పొరేషన్లు నిర్వీర్యం చేసి, విద్యా పథకాలు, ఉద్యోగ అవకాశాలు నాశనం చేసి బీసీల బతుకుల్ని బుగ్గిపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షులు వేము లకొండ శ్రీనివాస్ అధ్యక్షతన జోన్-3 అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం గుంటూరు అరండల్‌పేటలోని ఫర్టిలైజర్స్ మర్చంట్స్ కళ్యాణమండపంలో ఆదివారం జరిగింది. టీడీపీ రాష్ట్ర అధ్య క్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులుగా గుర్తించబడ్డ వారికి ప్రోత్సాహం అందించాలని ఎవరైనా చూస్తారని, కానీ జగన్ రెడ్డి మాత్రం వారి నుంచి ఎంత వరకు వీలైతే అంత వరకూ లాక్కుందామని, వారిని అణి చివేద్దాం అనేలా వ్యవహరిస్తున్నాడన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు సహా ఎంతో మంది ముఖ్యమంత్రులు స్థానిక సంస్థల్లో రిజర్వే షన్లు కొనసాగిస్తే... జగన్ రెడ్డి రద్దు చేశాడని అన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 56 కార్పొరేషన్లు పెట్టారని, ఆ కార్పొరేషన్ల ద్వారా ఎంత ఖర్చు చేశారో చెబితే సంతోషంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీసీల్లోని అన్ని కులాల నుంచి నాయకత్వాన్ని పెంచే లక్ష్యంతో చంద్రబాబు సాధికార సమి తుల్ని ఏర్పాటు చేశారని, బీసీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆ సాధికార సమితులు పనిచేయాలన్నారు. 55 శాతం జనాభా ఉన్న బీసీలు బలహీనులు ఎలా అవుతారో ఆలోచించుకోవాలన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమనేది మనం గుర్తించాలన్నారు. దశాబ్దాలుగా కుల గణన చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ మనం సాధించుకోలేక పోతున్నామని, కుల గణన జరిగితే జనాభా దమాషా ప్రకారం నిధులివ్వాలి, చట్ట సభలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాల న్నారు. అందుకే కుల గణన జరపాలని తెలుగుదేశం 2014 లోనే తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. బీసీలు దేహీ అని తన ముందు దేబురించేలా చేసేందుకు జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడన్నారు. బీసీలు ఎవరినీ ద్వేషించరు.. ఎవర్నీ దేహీ అని అడుక్కోరనే విషయాన్ని జగన్ రెడ్డి తెలుసుకోవాల న్నారు. మనకు రావాల్సినవి, కావాల్సినవి డిమాండ్ చేసి సాధిం చుకుందామని పిలుపునిచ్చారు. బీసీ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చదువుతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని గుర్తించిన చంద్రబాబు నియోజకవర్గా నికి ఒక రెసిడెన్షియల్ స్కూల్ కట్టించారని గుర్తుచేశారు. మత్స్య కారుల్ని చదివించేందుకు ప్రత్యేకంగా స్కూల్స్ కట్టించారని చెప్పారు. కానీ నేడు జగన్ రెడ్డి చదువులు దూరం చేసి ఉద్ధరిం చానంటూ ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. చేతివృత్తుల వారికి కేంద్రం ఇచ్చే సబ్సిడీలకు కూడా మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వకుండా బీసీలను దగా చేస్తున్నాడని విమర్శించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం వెంకట గురుమూర్తి 10 తీర్మానాలను ప్రవేశపెట్టగా... సభ్యులు ఆమోదించారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్, నరసరావుపేట ఇన్‌చార్జ్ చదలవాడ అరవింద్ బాబు హాజరై తమ సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాశ్, బీసీ నాయకులు నిమ్మల శేషయ్య, సింహాద్రి కనకాచారి, జనసేన నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు దొంతా సురేష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలా వెంకటేశ్వర్లు, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రాకుల తులసీరాం, గౌడసంఘం గుంటూరు అధ్యక్షులు పీటా సుబ్బరామయ్య, పద్మశాలి గుంటూరు అధ్యక్షులు సూరేపల్లి ఈశ్వరరావు, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు, భట్రాజు యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసుల శ్రీ ధర్మరాజు, ఏపీ విశ్వబ్రాహ్మణ సమాచార సమితి వ్యవస్థాపకులు దేవు చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లిబోయిన రాజు, రజక హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి కంభంపాటి రాము, మేదరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నందికల్లు విఠల్, కృష్ణబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోలా అశోక్ కుమార్, బోయ వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు ముప్పన వెంకటేశ్వర్లు, నగరాలు ఐక్యవేధిక అధ్యక్షులు బోయిన శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

మదర్సాకు రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మండలంలోని వేలూరు గ్రామంలో నూతనంగా నిర్మి స్తున్న ఇస్లాహున్నిసా మద ర్సాకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేలూరు గ్రామ ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా జాన్ సైదా ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందించి సంతోషాన్ని నింపారని, నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ వచ్చి సాయం చేస్తున్న ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం హజరత్ జలీల్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, మా శేషి రెడ్డి, వేలూరు గ్రామ ముస్లిం మత పెద్దలు పఠాన్ అల్లబక్షు, ఖాదర్ వలీ, ఖాసింపీరా, సుభానీ, బాజి, నానా, షరీఫ్ బాషా, మీరావలి, కాలేషా వలీ, పఠాన్ కాలేషా, నాగుర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

కాటూరి మెడికల్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలం పరిధిలోని హుస్సేన్ నగరంలో మాగులూరి భాను ప్రకాష్ సౌజన్యంతో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ లాయర్ మాగులూరి హరిబాబు కాటూరి మెడికల్ క్యాంప్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పెద్ద కుమార్తె ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టరు ధూళిపాళ్ల వైష్ణవి, కాటూరి మెడికల్ కాలేజీ డాక్టర్స్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : బాబాయ్ అబ్బాయ్ యూత్, టీమ్ తారక్ ఆధ్వ ర్యంలో సినీ నటుడు, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు మంగళగిరి నగరంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మంగళగిరి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బైకులతో ర్యాలీగా అన్నపూర్ణ థియేటర్ సెంటర్‌కు చేరుకుని కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, యువజన కాంగ్రెస్ నాయకుడు తాయి సుధీర్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం మంగళగిరిలోని విజయ డీలక్స్ థియేటర్‌లో జూనియర్ ఎన్టీఆర్ నటించిన సింహాద్రి చిత్రం రీ రిలీజ్ సందర్భంగా అభిమానులు కోలాహలం చేశారు. మధ్యాహ్నం చినకాకాని ఫైన్ ఆనంద శరణాలయంలోని బాలబాలికలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబాయ్ అబ్బాయ్ యూత్ ప్రతినిధి నక్కా రాజశేఖర్, యువజన కాంగ్రెస్ నాయకుడు తాయి సుధీర్ కుమార్ తదితరులు మీడియాతో మాట్లాడారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు నాగసిరి, శాంతి సిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్దిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు చూసి తన్మయం చెందారు. అనంతరం అనుపులోని యాంపి స్టేడియం, అశ్వమేద యగ్నశాల, శ్రీ రంగ నాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.40 వేల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో కళ్ళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 36 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నాయక్ సిసి జట్టు 78 పరుగులు ఆలౌట్ అవ్వగా, అనంతరం లక్ష్య చేదనకు దిగిన సీతా సిసి జట్టు ఒక వికెట్ నష్టానికి 80 పరుగులు చేసి 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. సీతా సిసి జట్టుకు ట్రోఫీతో పాటు లక్ష రూపాయల ప్రైజ్ మనీ విజయ్ ప్రతాప్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహకులు కళ్ళం గోవింద రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించడమే ఈ పోటీల యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళ్ళం రాజ శేఖర్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

గుండె నొప్పితో సీపీఐ నాయకులు చాట్ల మృతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు సీపీఐ గ్రామ కార్యదర్శి కామ్రేడ్ చాట్ల లక్ష్మయ్య (66) ఆదివారం ఉదయం గుండె నొప్పితో మృతిచెందాడు. ఆయన గుండె నొప్పిరావడంతో ఆయన కుమారులు ఖమ్మం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారని, పెనుగంచిప్రోలు రాత్రికి మృతదేహాన్ని గ్రామానికి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వారి బంధువుల ఆర్త నాదాలతో తూర్పు దళితవాడలో విషాద శాయాలు అలమ్ముకున్నాయి.

సాహిత్యాన్ని మరింత ప్రోత్సహించాలి..

'నెల నెల సాహిత్య మేళా'ను ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట : నెల నెలా... సాహిత్య మేళ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ శివ శంకర్ లోతేటి ప్రారంభించారు. నెల నెలా....సాహిత్య మేళ తెలుగు భాష సాహిత్య సమాలోచనపై జరిగిన కార్యక్ర మంలో పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన తెలుగు భాష పండితులతో కలెక్టర్ కలిసి తెలుగు తల్లికి నమస్కరించి, పూలమాలలు వేసి మననం చేసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన గ్రంధాల ద్వారా, ఇతిహాసాల ద్వారా చేసిన రచనలతో సమాజ సంస్కృతి, సంప్రదాయాలు బయటకు వచ్చాయని పేర్కొన్నారు. కళలు, కావ్యాలతో ప్రజలను చైతన్యపరిచేందుకు ఎంతోమంది ప్రముఖులు, కవులు, రచయతలు తమ వైవిధ్యమైన రచనలు ద్వారా ప్రసంగాలతో సమ సమాజ స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. అటువంటి పల్నాడు జిల్లాలో సాహిత్యాన్ని మరింత ప్రోత్సహించాలని తెలుగు భాషా ప్రేమికులకు సూచించారు. తెలుగు నేలపై అనేక కావ్యాలు, కవులు పుట్టి సమాజ చైతన్యం కోసం చేసిన కృషిని జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతీనెలా నిర్వహించేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం వ్యాస మహా భారతం నన్నయ మహాభారతం మధ్య కాలంలో తెలుగు భాష లో వచ్చిన మార్పులు, వ్యత్యాశాలు అనే అంశంపై సమావేశంలో చర్చలు జరిపారు. ఈ అంశాలపై పలువురు ప్రముఖులు మాట్లాడారు. కార్యక్రమంలో వక్తలుగా సత్య శ్రీనివాస అయ్యంగార్, కేవీ కోటయ్య, డాక్టర్. చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పోలెసర్తి రాధాకృష్ణ మూర్తిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, తెలుగు భాష సాహిత్య ప్రియులు, కలెక్టరేట్ సిబ్బంది, కమాండ్ కంట్రోల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీల ఆరోగ్యానికి మొదటి మందు అవగాహనే

ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సునీల్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కిడ్నీల ఆరోగ్యానికి అవగాహనే మొదటి మందు అని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కె.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'కిడ్నీ సంబంధిత వ్యాధులు'పై అవగాహన సభ ఆదివారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కె.సునీల్‌కుమార్ మాట్లాడుతూ మధుమేహం, హైపర్ టెన్షన్ వంటి వ్యాధులు పెరగటం వలన కిడ్నీలు ఫెయిల్ అయి చనిపోయే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కిడ్నీ పాడవుతున్న విషయం ముందుగా తెలుసుకుంటే భారీ నష్టాన్ని ఆపేయవచ్చని సూచించారు. అలాగే జీవన శైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు కారణంగా కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని, యువతీ యువకుల్లో ఈ వ్యాధులు పెరగటం వైద్య రంగాన్ని కలవరపెడుతున్నాయని పేర్కొన్నారు. కిడ్నీలో రాళ్ళ వల్ల, ఇన్ఫెక్షన్ల వల్ల కూడా కిడ్నీ వ్యాధులు ప్రభలుతున్నాయని, విపరీతమైన మందుల వాడకం, డాక్టర్ సలహా లేకుండానే చీటికీ మాటికీ పెయిన్ కిల్లర్లు, అసిడిటీ కోసం వేసుకునే మందులు, యాంటీబయటిక్స్ వల్ల కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. నేటి ఆధునిక కాలంలో కిడ్నీ వ్యాధిని ముందుగా గుర్తించటం సులభమైందని, వ్యాధి తీవ్రతను తగ్గించగల మందులు విస్తృతంగా లభ్యమవుతున్నట్లు డాక్టర్ సునీల్‌కుమార్ చెప్పారు. డయాలసిస్ కిడ్నీ మార్పిడీ సేవలు జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చాయని, అలసటకు గురవటం, కాళ్ళు, కాలిమడమలు, పాదాలలో వాపు, మూత్ర విసర్జనలో సమస్యలు, మూత్రంలో రక్తం పడటం మూత్రపిండాల వ్యాధికి లక్షణాలని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన జీవన శైలితో, సకాలంలో ఆరోగ్యకరమైన నిర్ణయాలు తీసుకోవటం ద్వారా డాక్టర్‌ను సంప్రదించటం ద్వారా మూత్రపిండాల వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని ఆయన వివరించారు. చివరిగా డాక్టర్ సునీల్‌కుమార్ దంపతులను అవగాహన సంస్థ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు ఉన్నారు.

ప్లాట్‌ఫాం రిక్షా అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామంలో రిక్షా కార్మికులు బడుగు సాంబశివరావు బాడుగకు రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నారు. తమ రిక్షా బండి పాడయిపోయి, కొత్త రిక్షా కొనే స్థోమత లేక ఇబ్బందిపడుతున్న తనకు మూడుచక్రాల ఫ్లాట్ ఫామ్ రిక్షా బండ్లను అందజేయాలని కుంచనపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు(అబ్బాయిగారు) ద్వారా నారా లోకేష్‌కు అర్జీ రూపంలో విన్నవించుకోగా బడుగు సాంబశివరావు జీవనోపాధి నిమిత్తం టీడీపీ పార్టీ నాయకులతో మూడుచక్రాల ఫ్లాట్ ఫామ్ రిక్షాను నారా లోకేష్ అందజేయించారు. బడుగు సాంబశివరావుకు మూడుచక్రాల ఫ్లాట్ ఫామ్ రిక్షాలను అందజేసిన వారిలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, కుంచనపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, కుంచనపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రమేష్, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, కుంచనపల్లి గ్రామ తెలుగు మహిళా అధ్యక్షురాలు దాశెట్టి అరుణ, తాడేపల్లి మండల తెలుగు రైతు కార్యదర్శి శేషంశెట్టి శ్రీనివాసరావు, మంగళగిరి నియోజవర్గ తెలుగు రైతు కార్యదర్శి కొలంటి మహేశ్వరరావు, కాజా భరత్ తదితరులు ఉన్నారు.

టిఫిన్ బండ్లు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి ఆధ్వర్యంలో మహానాడు ప్రాంతంలో ఇస్త్రీ బండి, టిఫిన్ బండ్లను అందజేశారు. తాడేపల్లి పట్టణంలోని మహానాడులో నివాసం ఉండే వెల్దుర్తి నాగమణి అద్దె బండి తెచ్చుకొని ఇస్త్రీ చేసుకుంటూ, తోట బాబురావు కూడా టిఫిన్ బండి అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం ఉన్న లేకున్నా అద్దెలు చెల్లించవలసి వస్తుందని, ఆర్థిక ఇబ్బందులు బాగా ఉన్నాయని వేణుగోపాల స్వామి రెడ్డికి తెలియజేయగా వారి పరిస్థితిని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఇస్త్రీ బండిని, టిఫిన్ బండిని జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల ముడి దేవిడ్ రాజు చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ వైఎస్ఆర్సిపి ఎస్సి, ఎస్టీ. బీసీ. సెల్ కన్వీనర్లు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, భూపతి కిషోర్, రాము, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దిబ్బయ్య కుటుంబానికి టీడీపీ అండ

విశాలాంధ్ర - నకరికల్లు : మండలంలోని కుంకలగుంట గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్త నందిగం దిబ్బయ్య ఆదివారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి వారి స్వగృహానికి వెళ్లి దిబ్బయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గానికి చెందిన దిబ్బయ్య తెలుగుదేశంపార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని ఈ సందర్భంగా బాజీ చౌదరి తెలిపారు. ఆయన కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

నేడు ఉదయం 9 గంటల నుంచి స్పందన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రస్తుత వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సోమవారం స్పందనను ఉదయం 9 గంటల నుండి నిర్వహిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఫిర్యాదుదారులకు ఇబ్బంది లేకుండా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్పందన ఉదయం 9 గంటల నుండి జరుగుతుందని, 8.30 గంటల నుండి ఫిర్యాదుల రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. స్పందనకు ప్రధాన కార్యాలయంకు రాలేని వారు అందుబాటులోని సచివాలయంలో కూడా అర్జీలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

మందలించారని.. యాసిడ్ తాగి ఆత్మహత్య

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: మద్యం సేవిస్తున్నాడని మందలించారని యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామవరప్పాడుకు చెందిన జీ. పెద్దిరాజు (45) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికు భార్య ఇద్దరు సంతానం. పెద్దిరాజుకు మద్యం సేవించే అల వాటు ఉంది. నిత్యం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గోడవ పడుతున్నాడు. ఈనేపథ్యంలో ఈనెల 20వతేదీన మద్యం సేవించి గోడవ పడ్డాడు. భార్య మందలించడంతో ఇంట్లో యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు పటమట పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జీఈఎతో కలిసి నడవండి: చాంద్‌బాషా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)తో కలిసి నడవాలని ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు పలు ఉద్యోగ సంఘాల వారిని కోరారు. ఈ మేరకు ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన డిమాండ్‌లకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం చాంద్‌బాషా మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి నెల 1వ తేదీన జీతభత్యాలు చెల్లించేలా రట్టం చేయాలని, 1993, నవంబర్ 25వ తేదీ కంటే ముందు నియమితులైన ఎన్ఎమ్ఆర్, డైలీవేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా అన్ని శాఖలలో డీఎస్సీ ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు(సమాన పనికి సమాన వేతనం) ఇవ్వాలన్నారు. అలాగే 11వ పీఆర్సీ అమలులో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలలో భాగంగా ఆర్థికపరమైన బకాయిలను, డీఏ, ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ములకు భద్రత కల్పించాలని, పదవీ విరమణ గావించిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ రోజే అన్ని ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జీఈఎ సహాధ్యక్షులు మహేష్ బాబు, కార్య నిర్వాహక కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, ఉపాధ్యక్షులు శ్యాం కుమార్, సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, రాధాకృష్ణ, దక్షిణా మూర్తి, పెద రత్తయ్య, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: క్రైస్తవుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేసి సమావేశాల ద్వారా వచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించి క్రైస్తవుల అభివృద్ధి, అభ్యున్నతికి పాటుపడే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ వ్యవహారాల సలహాదారుడు డాక్టర్ మద్దు బాలస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని ఎ.ఇ.ఎల్.సి నార్త్ ప్యారిస్ చర్చి రెవరెండ్ పాస్టర్ బాబురావు ఆధ్వర్యంలో, వెస్ట్ ప్యారిస్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ సతీష్, ఇతర ప్యారిస్ పాస్టర్స్, కౌన్సిల్ మెంబర్స్, మహిళా విభాగం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి జీవించాలని కోరారు. త్వరలో గుంటూరులో ఉన్నటువంటి క్రైస్తవ సంఘాలన్నింటితో కలసి ఒక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. క్రైస్తవులందరూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో చేయూత నివ్వాలని అభ్యర్థించారు.

దాహార్తిని తీరుస్తున్న లైవ్ భారత్ ఫౌండేషన్

విశాలాంధ్ర-గుంటూరు : భానుడి ప్రతాపంతో ఎండలు మండిపోతున్నా యి.... ప్రజలు ఎండబారిన పడి దాహంతో నోరు పిడచ కట్టుకుపోయి ఇబ్బందులు పడటాన్ని గమనించిన లైవ్ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ గుంటూరు నగరంలో పలు చోట్ల కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. నగరంలోని బ్రాడీపేట, బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల, ఇన్నర్ రింగ్ రోడ్లలో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాలలో రోజుకు 15 నుంచి 25 వాటర్ కేన్స్(20 లీటర్లు) వాటర్‌ను ప్రజలు తాగుతూ తమ దాహార్తి తీర్చుకుంటున్నారని, అప్పుడప్పుడు ఉచిత మజ్జిగ పంపిణీ కూడా చేయడం జరిగిందని ఈ చలివేంద్రాలను పర్యవేక్షిస్తున్న పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్‌లు తెలియచేశారు.

స్వర సిరులు వర్షింపజేసిన చిత్రగీతాలాపన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ (ఒంగోలు) సమర్పణలో ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై ఘంటసాల శత జయంత్యుత్సవాల సందర్భంగా స్వరాభిషేకం పేరిట తులసి బృందంతో జరిగిన చిత్ర గీతాలాపన శ్రోతలపై స్వర సిరులు వర్షింపచేస్తూ సాగింది. గాయని గాయకులుగా లక్ష్మీతులసి,శ్రీదేవి, సంస్థ అధ్యక్షుడు యు కోటేశ్వరరావు,పురాణం సుబ్రహ్మణ్యం,కె కృష్ణమోహన్, శేషగిరిలు దేవా దీన బాంధవ, నేనే రాధనోయి,మాయ చేసి పోతివిరో,ఓహెూ మోహనరూప, రాజశేఖరా,కవాలి సాంగ్ వంటి సంగీత సాహిత్య ఉత్కృష్టతను చాటే ఇత్యాది పాటలను శ్రవణపేయంగా పాడి వినిపించారు. ఎస్ కె బాబు వ్యాఖ్యాతగా వ్యవహరించగా టి నారాయణ,ఆర్ సదానందరావు లు పర్యవేక్షించారు.

విజ్ఞానం పెంపునకు గ్రంథాలయాలు దోహదం

విశాలాంధ్ర-నరసరావుపేట : విజ్ఞానం పెంపొందాలంటే చిన్న తనం నుంచి ప్రతిఒక్కరూ గ్రంథాల యాలకు వెళ్లి పుస్తకాలను చదవా లని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణంలోని, పల్నాడు సెంటర్ సమీపంలో ఉన్న శాఖ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పుస్తకాలను పరిశీలించారు. విద్యా, విజ్ఞానం, మహనీయులు రచించిన గాధలు, పిల్లల కోసం బాలల పుస్తకా లను అందరికీ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. వేసవిలో చిన్నపిల్లల పుస్తక పఠనంపై ఎక్కువ మక్కువ ఉండేలా అవ గాహన కల్పించాలని పేర్కొన్నారు. పుస్తకాలతో పాటు వారికి ఇష్టమైన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. శాఖా గ్రంథాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-మాచర్ల: పార్టీకి సేవలందిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన పులిపాటి శ్రీనువాసరావు కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులిపాటి శ్రీనువాసరావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని, తోటి వారితో స్నేహభావంగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్న శ్రీనివాసరావు నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. శ్రీనువాసరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు రూ.50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో రామిశెట్టి వెంకటేశ్వర్లు, మేకపోతు రామాంజి రెడ్డి, గట్ల కోటిరెడ్డి, మెట్టు వీరారెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

విశాలాంధ్ర-పెదకూరపాడు : భ్రమరాంబిక సమేత రామలింగేశ్వర స్వామి శివపార్వతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని బలుసుపాడు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబిక సమేత రామలింగేశ్వర స్వామి ఏడవ వార్షికోత్సవం సందర్భంగా గత మూడు రోజుల నుంచి వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమున ఆదివారం వేద బ్రాహ్మణులు నుదురుపాటి శేషగిరి శర్మ, సందీప్ శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి భక్తులచే పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు 5000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మద్దినేని నరసింహారావు, ఇరుగులపాటి అబ్బయ్య, సర్పంచి నల్లమేకల సాంబశివరావు, చిరుమామిళ్ల సాంబశివరావు, ధనుంజయ రావు, గంట ఆనందయ్య, చిన్నం వెంకట్, నాగేశ్వరరావు, శ్రీపతి శ్రీనివాసరావు, వేముల వీరాంజనేయులు, మందడపు సాంబశివరావు, కల్లేపల్లి వెంకటేశ్వర రాజు, రాయవరపు వెంకటేశ్వరరావు, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి చేటు....

విశాలాంధ్ర-చేబ్రోలు: కుళ్లిన మాంసం వ్యర్థాలు అత్యంత ప్రమాదకరం. వ్యర్థాలను ఆహారంగా తీసు కున్న చేపలను తినకూ డదు. ఆ చేపలను తిన్న వారికి ఉదర సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత ఆహారం వల్ల నులి పురుగులు పెరిగే అవకాశం ఉంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జీవో అమలు ఎక్కడా... పర్యావరణానికి ప్రజల ఆరోగ్యఆనికి చేటు చేస్తున్న వ్యర్థాల వాడకాన్ని అరికట్టేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు 2016 డిసెంబర్ 4వ తేదీన జీఓ56 ను ప్రభుత్వం విడుదల చేసింది. మండల స్థాయిలో తహశీల్దార్ చైర్మన్, వీఆర్వో, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ అధికారులు ఉంటారు. ఈ కమిటీపై పర్యవేక్షణ అధికారం కలెక్టర్ ఉంటుంది. వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాలు పట్టుబడితే డ్రైవర్ లైసెన్సు, రవాణా పర్మిట్లు రద్దు చేసి, వాహన యాజమాని, డ్రైవర్‌పై ఐపీసీ కేసులు నమోదు చేయాలి. చేపల చెరువు లైసెన్సు రద్దు చేసి రూ.10వేల జరిమానా విధించొచ్చు. కానీ చేబ్రోలు మండలంలో ఎక్కడా కేసులు నమోదైన సంఘటనలు కనబడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ చట్టాలను కాపాడాల్సిన అధికారులే కోళ్ల వ్యర్థాలతో వ్యాపారం చేస్తున్న వారికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలని చేపల వినియోగదారులు కోరుతున్నారు.

దళితుల రక్షణ కోసమైనా జగన్‌ను గద్దె దించాలి

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీలో జరుగుతున్న దారుణాలు కలవరపెడు తున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో 'జగన్ పాలనలో దళితులపై దాడులు, ప్రభుత్వ వైఫల్యాలు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. విజయ వాడ ఐలాపురం హెూటల్‌లో ఆదివారం టీడీపీ నేత వర్ల రామయ్య అధ్యక్షత ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో మనుస్మృతిని అమలు చేస్తున్నాడని ఆరోపించారు. దళిత, గిరిజనులపై దాడులు జరుగుతున్నా కనీసం వారి కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్య నిషేదం అమలు చేస్తామని హామి ఇచ్చిన జగన్ రాష్ట్రంలో మద్యం, గంజాయి బెల్టుషాపులు నడుస్తున్నా చర్యలు చేపట్టం లేదని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ దళితులు కేసులు పెట్టినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. దళితులు హత్యకు గురవుతున్నా కేసులు నమోదు కావడం లేదన్నారు. దళితుల రక్షణ కోసమైనా జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పలువురు దళిత సంఘాల నేతలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-అద్దంకి : సుదూర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం నియోజకవర్గ కేంద్రమైన అద్దంకి విచ్చేసే ప్రజల,వాహన చోదకుల దాహార్తిని తీర్చేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం, ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల శ్రీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సాధు వెంకటేష్, జనసైనికులు సాంబశివ రావు,చిరంజీవి,అనిల్, చందు,అరుణ్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గరటయ్యను కలసిన కౌన్సిలర్

విశాలాంధ్ర-అద్దంకి: మున్సిపాలిటి 19వ వార్డు కౌన్సిలర్, కాపు నాయకుడు, వైస్ చైర్మన్-2 పదవిని ఆశిస్తున్న యేజెండ్ల నాగరాజు అద్దంకి మాజీ ఎమ్మెల్యే వైసీపీ సీనియర్ నాయకులు బాచిన చెంచు గరటయ్యను కలిశారు. వార్డులో వీరరాఘవస్వామి మాన్యంలో ఇళ్ళు నిర్మించుకున్న పేదలకు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల సంక్షేమం కోసం నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజల్ని చైతన్య పరచి వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేయాలని గరటయ్య కౌన్సిలర్ నాగరాజుకు సూచించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పిడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థులలో బాషా నైపుణ్యం, వివేచన శక్తి పెరగాలంటే పుస్తకాలు బాగా చదవాలని, చదివిన దానిని ఇతరులకు అర్థవంతంగా చెప్పాలని వీఓఆర్డి మురళి బాపూజీ అన్నారు. ఆదివారం చీరాల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రంథపాలకురాలు ధనమ్మ అధ్యక్షతన బాలబాలికలచే పుస్తకాలు చదివించి, వారిచే కథలు చెప్పించారు. తదనంతరం టీచర్ సాయి కుమార్‌తో స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ చెప్పించారు. గత వారంలో జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈఓఆర్డిమురళి బాపూజీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్, వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సర్వీసెట్టి సుబ్బరామయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేంజర్ల రాజేష్‌కు దళిత నేతల సన్మానం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ప్రజా గాయకుడు, వక్త, రచయిత, సమత సైనిక్ దళ్ దక్షిణ భారత దేశ ఉపాధ్యక్షులు రెంజర్ల రాజేష్ మాలమహానాడు బాపట్ల కమిటీ ఆహ్వానం మేరకు బాపట్ల పట్టణ అంబెద్కర్ భవన్ లో సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు దళిత సంఘాల నాయకులు రెంజర్ల రాజేష్ దృశాలువాతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పచ్చదనం పర్యావరణపై అవగాహన

సెక్షన్ అధికారి పీవీ సాయికుమార్

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని తాడివారిపల్లి గ్రామంలో సెక్షన్ ఆఫీసర్ పివి సాయికుమార్ ఆధ్వర్యంలో పచ్చదనం, పర్యావరణ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సెక్షన్ అధికారి పివి సాయికుమార్ మాట్లాడుతూ పచ్చదనం పర్యావరణం సకల జీవకోటి రాశుల మనుగడుకు ఎంతో పునాది అన్నారు. ప్రకృతిలోని పచ్చదనాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఆధారపడిందన్నారు. పచ్చదనాన్ని కాపాడుకునేందుకు ముందుగా మానవ జీవితంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించు కోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణాన్ని కలుషితం చేయడంతో పాటు ముప్పు కలిగిస్తుంది అన్నారు. పై విషయాలన్నింటినీ గుర్తేరిగి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా అటవీ సంపదను కాపాడుకుందాం అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది బీట్ అధికారి జాన్‌రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు, డి డేవిడ్, ఎన్ ఇ రమణయ్య పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు అన్నవరం పాడు కాలనీలో నివసిస్తున్న పేద బ్రాహ్మణ మహిళ భవానికి 100 రోజులకు సరిపడా బియ్యం నూనె నిత్యవసర వస్తువులు అందించి శ్రీ సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష మానవత్వం చాటారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ పేద బ్రాహ్మణ వృద్ధురాలు భవాని భర్త చనిపోయి కుటుంబ ఇబ్బందులు దశలో ఆమె అనారోగ్యంతో కాలు విరిగి మంచానికి పరిమితం అయింది. చేతికొచ్చిన కుమారుడు సాయికుమార్ ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరి షుగర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల్లో తింటానికి బియ్యము నిత్యవసర వస్తువులు లేక ఉప్మా తింటూ అర్థ ఆకలితో ఉంటున్నారు. వీరి పరిస్థితి తెలుసుకున్న సాయి మిత్రుడు కిరణ్ ద్వారా విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి అండగా సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ భాష ఉండి వారికి వైద్య ఖర్చులకు మందులకు కుటుంబ పోషణకు దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిక్కాల కిరణ్ కుమార్ సూర్య శ్రీ ట్రస్ట్ సభ్యులు రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల నిర్వహణకు అంజిరెడ్డి రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర - బాపట్ల : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి.కె.ఎమ్.యూ) 22వ రాష్ట్ర మహాసభలు ఆగష్టు నెలలో జరగనున్నాయి. ఈ మహాసభల నిర్వహణకు నల్లమలపు అంజిరెడ్డి ఆదివారం జరిగిన ఆహ్వాన కమిటీ సమావేశంలో రూ. 50 వేలు విరాళం ప్రకటించారు. వీరితో పాటు పలువురు తమ వంతుగా మహాసభల విజయానికి చేయూతనిచ్చారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి కష్టజీవుల హక్కుల కోసం ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల నిర్వహణకు సహకరించాలని శ్రీధర్ కోరారు.

22వ రాష్ట్ర మహాసభల విజయవంతమే లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశంలో నేతలకు దిశానిర్దేశం

విశాలాంధ్ర - బాపట్ల : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి.కె.ఎమ్.యూ) 22వ రాష్ట్ర మహాసభలు విజయవంతమే లక్ష్యంగా సన్నాహాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ నేతలకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని పూర్ణ ప్యాలెస్‌లో ఆదివారం సీపీఐ జిల్లా విస్తృత స్థాయి సమితి సమావేశం పార్టీ జిల్లా కౌన్సిల్ నాయకుడు షేక్ కాలేషాగారి ఖాదర్ బాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ ఆగష్టు నెలలో బాపట్లలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలు జరిపేందుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్నీ నియోజకవర్గ, మండల, గ్రామ శాఖ సమావేశాలు ఏర్పాటు చేసి మహాసభలు జయప్రదం చేయటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ కనివిని ఎరుగని రీతిలో ఎర్రజెండా బాపట్లలో రెపరెపలాడేలా కార్యచరణ చేయాలని సూచించారు. 10 వేల మందిలో బాపట్ల పుర వీధులో భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ ద్వారా ప్రభుత్వాలకు కనువిప్పు కలిపించాలని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్, తుమ్మల పూర్ణచంద్ర శేఖర్‌రావు,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, బావిరెడ్డి ప్రభాకర్, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, అక్కల నాగమణి, మేడా వెంకట్రావు, మల్లెల ఏసేబు, షేక్ షంషూన్‌బీ, మేకల రమణయ్య, అద్దంకి నాగేశ్వరరావు, సన్నమూరి శ్రీనివాసరావు, షేక్ జిలానీ, షబ్బీర్, సింహాద్రి శివయ్య,దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ముండ్ల జాన్ తదితరులున్నారు.

మహాసభల నిర్వహణకు వచ్చిన వాగ్దానాలు

- నల్లమలపు అంజిరెడ్డి - రూ. 50 వేలు
- కనపర్తి కృపాదాసు మాస్టర్ కుమారుడు బెనహర్ మాస్టర్ - రూ. 25 వేలు
- పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సైనికుడు - రూ. 25 వేలు
- శ్రేయోభిలాషి - రూ. 25 వేలు
- కాబోతు రామస్వామి వారసులు విజయశేఖర్ - రూ. 10 వేలు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముండ్ల జాన్ - రూ. 10 వేలు
- షేక్ కాలేషాగారి ఖాధర్ బాషా - రూ. 10 వేలు
- షేక్ కాలేషాగారి సైదా జ్ఞాపకార్థం మనుమళ్లు - రూ. 10 వేలు
- వల్లెపు నరసింహం - రూ. 10 వేలు
- అప్పిల సరోజ భర్త తన్నీరు సింగరకొండ - రూ. 10 వేలు
- బావిరెడ్డి వెంకటేశ్వర్లు కుమారుడు ప్రభాకర్ - రూ. 5 వేలు, 2 క్వింటాళ్ల బియ్యం
- మందా సూరిబాబు ఏల్చూరు సర్పంచ్ - రూ. 5 వేలు
- తుమ్మల పూర్ణచంద్రశేఖర్ - రూ. 5 వేలు
- అక్కల నాగమణి - రూ. 5 వేలు
- దొంతిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి - రూ. 5 వేలు
- కొత్తపట్నం సీపీఐ మండల సమితి - రూ. 100 కేజీల చికెన్

స్కూల్‌బస్సుల ఫిట్‌నెస్‌లో నిబంధనలకు తిలోదకాలు

ప్రచారానికే జీఓ నెం.35 పరిమితం

విశాలాంధ్ర-రేపల్లె : విద్యాసంస్థలు బస్సుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు పాటించటంలేదు. రవాణాశాఖా రూపోందించిన జి.ఓ.నెం: 35లోని అంశాలను విద్యాసంస్థలు బస్సుల నిర్వహణలో పాటించకపోయిన రవాణాశాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తూన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి యేడు మే 15వ తేదితో విద్యాసంస్థల బస్సులకు మోటారు వాహన తనిఖీ అధికారులు ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కాలం ముగుస్తుంది. తిరిగి విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందుగానే ప్రతి విద్యాసంస్థ జూన్ 12వ తేదీలోపు తమ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్ పొందేందుకు అధికారులకు పలు ధృవపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మోటార్ వాహనాల చట్టం 1989, రూల్ 185లో క్లాజ్ (ఎఫ్) విద్యాసంస్థల బస్సులకై 2011లో సవరించిన క్లాజ్(జి) ప్రకారం సదరు పాఠశాల, కళాశాల పేరు, టెలిఫోన్ నెంబర్‌తో సహ పూర్తి చిరునామా బస్సు ఎడమవైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా వ్రాయాలి. డ్రైవర్‌గా నియమించే వ్యక్తి వయస్సు 60 సంవత్సరాలకు మించి ఉండరాదు. డ్రైవర్‌కు షుగర్, రక్తపోటు, కంటిచూపు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ప్రతి మూడు నెలలకొకసారి యాజామాన్యాలు చేయించి రికార్డులను భద్రపరచాల్సి ఉండగా ఈ నిబంధనను ఎవ్వరూ పాటించటంలేదు. కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉన్న డ్రైవర్‌లను ఎంపిక చేసి వారి లైసెన్స్‌లను సంబంధిత ఆర్.టి.ఏ ఆఫీసులో రుజువు చేసుకోవాలి. డ్రైవర్ పూర్తి వివరాలను పేరెంట్స్ కమిటీకి తెలియజేయాలి. వాహన కండీషన్‌ను తెలుసుకునేందుకు ప్రతి నెల ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటి కలిసి వాహనాన్ని పరీక్షించాలి, ఇందుకోసం ప్రత్యేకంగా రిజిష్టరును పెట్టి అందులో నమోదుచేయాలి. ప్రతి వాహనంలో అత్యవసర ద్వారం, ఫస్టుఎయిడ్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలి. బస్సులో కంప్లయింట్ బుక్‌ను అందుబాటులో ఉంచాలి. విద్యార్థుల సురక్ష నిమిత్తం యాజామాన్యాలు తమ పాఠశాల, కళాశాలలోనే బస్సులను నిలుపుకుని అక్కడే నుండే విద్యార్థులను ఎక్కించటం, దించటం చేయాలి. బస్సులో డ్రైవర్‌తో పాటు ఒక అటెండర్ యూనిఫాం ధరించి ఉండాలి. బస్సు వెళ్ళు రూట్ మ్యాప్‌తో పాటు, బస్సులోని విద్యార్థులు ఎక్కటం, దిగటం డ్రైవర్‌కు కనబడేలా బస్సులో పెద్ద మిర్రర్‌ను అమర్చాలి. ప్రతి విద్యాసంస్థ బస్సు డ్రైవర్‌కు సంవత్సరానికి ఒకసారి ఏప్రియల్, మే నెలలలో జెటిసి, డిటిసి, ఆర్‌టిఓ ద్వారా నిర్వహించబడే ఒక్కరోజు రిఫ్రెషర్స్ ట్రైనింగ్‌లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలి. పరిమిత సీటింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువ మంది విద్యార్థులను తీసుకువెళ్లకూడదు. యాజామాన్యం మరియు పేరెంట్స్ కమిటి సమన్వయంతో బస్సు బయలుదేరు స్థలం నుండి గమ్యస్థానం చేరువరకు ప్రతిరోజు వంతులవారీగా ఒక టీచర్ ఒక పేరెంట్ బస్సులో ప్రయాణించేలా చూడాలి. ఇలాంటి నిబంధనలు అనేకం ఉన్న యూజమాన్యాలు మాత్రం ఒకటి, రెండు తప్ప ఏమాత్రం పాటించటంలేదు. ఇటీవల రాష్ట్రంలో ప్రైవేట్ స్కూల్ బస్‌లు అనేక ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రవాణాశాఖాధికారులు స్కూల్ బస్‌లకు చేయాల్సిన ఫిట్‌నెస్ పరిక్షలు నామమాత్రంగానే చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సుల విషయంలో నిబందనలకు అనుగుణంగా పిట్‌సెస్ సర్టిఫికెట్‌లు ఇచ్చి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రాన్ని నిట్ట నిలువునా ముంచిన వైసీపీ ప్రభుత్వం

- మాజీమాజీ మంత్రి నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : ఆంధ్ర రాష్ట్రాన్ని నిట్ట నిలువునా ముంచి, రాష్ట్రానికి రాజధాని లేని స్థితిలో ఆంధ్ర రాష్ట్ర నిలబెట్టిన దౌర్భాగ్య ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అని మాజీ మంత్రి టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు నక్క ఆనంద్ బాబు విమర్శించారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ పుర వేదిక వద్ద తెలుగుదేశం పార్టీ చేపట్టిన రాష్ట్రానికి ఇది ఏమి కర్మ కార్యక్రమం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అవినీతి తప్ప రాష్ట్ర అభివృద్ధిపట్టడం లేదన్నారు. దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అదేవిధంగా అత్యధిక కేసులు ఉన్న ముఖ్యమంత్రి కూడా జగనే అన్నారు. ఇటువంటి దుర్మార్గపు ముఖ్యమంత్రి రాష్ట్రానికి రావడం ఆంధ్ర రాష్ట్ర ప్రజల కర్మ పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నానంటూ వాటిలోనే అక్రమ మార్గాన వేల కోట్లు వైసిపి నేతలు దండుకుంటున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాములో రాజధాని నిర్మాణం కోసం 16 వేల కోట్లు ఖర్చు చేస్తే మేము నిర్మించిన రాజధాని లోనే ఉంటూ రాజధాని అమరావతిని చిందర వందర చేశారని తెలియజేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి 65 వేల కోట్ల రూపాయలు దారి మళ్లించిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఢిల్లీలో లిక్కర్ స్కామ్ అంటున్నారని ఆంధ్రప్రదేశ్ లో అంతకంటే ఎక్కువ లిక్కర్ స్కామ్ జరుగుతుందని దీనిపై దర్యాప్తు చేస్తే మరోసారి జగన్ జైలు కెళ్ళడం ఖాయం అన్నారు. ఇటువంటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా పని చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. సభకు అధ్యక్షత వహించిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు మాట్లాడుతూ అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని జోష్యం చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు సాయి బాబా, మైనేని మురళీకృష్ణ, శేషు బాబు, తదితరులు ప్రసంగించారు. సమావేశంలో పార్టీ నాయకులు దండే సుబ్బారావు, శివారెడ్డి, ఎల్లారెడ్డి, అమ్మిశెట్టి కిషోర్, మొవ్వ శరత్చంద్ర, హనీఫ్, కొల్లూరు శ్రీధర్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, దప్పలపూడి సుధాకర్, వేల్పుల రవి, కొంద్రు బుల్లయ్య తదితరులు ఉన్నారు.

మిషన్ 50 గో టు విలేజ్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు నూతన ప్రజాస్వామ్య ఉద్యమానికి రాజకీయాలు అతీతంగా మద్దతు కూడా కట్టాలని ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి తాతపూడి బాల రోశయ్య అన్నారు. ఈ నెల 23న ఒంగోలులోని హెచ్‌సిఎం గ్రౌండ్లో జరుగు మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, అధిక సంఖ్యలో నాయకులకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామాల నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రిజర్వేషన్లు వర్గీకరణ 28 ఏళ్లుగా అనేక పోరాటాలు చేసి నా రిజర్వేషన్లు వర్గీకరణలో మాత్రం జాప్యం జరుగుతుందని, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పోరాడి రిజర్వేషన్లు సాధించుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తారని తెలిపారు. గ్రామాల నుండి ప్రతి కార్యకర్త ఈ సభకు హాజరు కావాలని కోరారు.

రావినూతలలో రూ.50.85 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం

విశాలాంధ్ర - కొరిశపాడు : రావినూతల గ్రామంలో ఆదివారం బాచిన చెంచు గరటయ్య రావినూతల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలోని ప్రజలందరూ నన్ను ఎంతగానో ఆదరించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు పేద ప్రజలు నివేశన స్థలాల కోసం దేవాదాయ భూమిని గ్రామంలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు చొప్పున ఇప్పించడం జరిగిందనీ అన్నారు ఆ స్థలల్లోని మౌలిక సదుపాయాల ఏర్పాటు అభివృద్ధి దృష్ట్యా చిల్ల చెట్లు తొలగించే ప్రక్రియకు ఈరోజు నాంది పలికారు అదేవిధంగా గ్రామంలో సమస్య గుర్తించి జల జీవన్ మిషన్ పథకం ద్వారా 50.85 లక్షల నిధులతో ఇంటింటికి త్రాగునీరు అందించేదానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు ఈ కాంట్రాక్టు గుంటూరులోని రఘురాం హ్యూమ్ పైప్స్ లిమిటెడ్ మరికొద్ది రోజుల్లో పనులను ప్రారంభిస్తుందని కంపెనీ ప్రతినిధి శ్రీమన్నారాయణ తెలిపారు గ్రామ సర్పంచ్ శ్రీమతి చాట్ల విజయ వీణ మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలకి సహాయ సహకారాలు అందిస్తున్న అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్యకు మరియు మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరిటకు కృతజ్ఞతలు తెలియజేశారు మన గ్రామంలోని సామాజిక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎస్సీ ఎస్టీ స్థలాల లో ఉన్న చిల్ల చెట్లను తొలగిన్చుట మరియు 8 సెంట్లు నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి అందులో ప్రజలను భాగస్వామ్యం చేయడం అభినందనీయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నుండి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సూచికలగా ఎస్సీ ఎస్టీలు సమాజంలో అందరితోపాటు సమాన స్థాయిలో ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి మస్తాన్ రావు వైయస్సార్ సిపి నాయకులు 8 వ వార్డు మెంబర్ గాలి సుబ్బారావు 14 వ వార్డ్ మెంబర్ బడుగు వీరయ్య గ్రామ నాయకులు రామినేని వెంకటరమణ రాచపూడి గ్రామ నాయకులు జగన్నాథం పాండురంగారావు పాలపర్తి సాల్మన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగితోలితే తాటతీస్తారు

- మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వైనం
- తొలిత బుజ్జగింపులు తదుపరి కఠిన చర్యలు



విశాలాంధ్ర-పీసీపల్లి : నిత్యం రోడ్డు ప్రమాదాల రూపంలో కొనసాగుతున్న మరణ మృదంగానికి అతిగా మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడమే కారణాలవుతున్నాయి. మద్యం మత్తు కారణంగా ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పటికీ ఫలితాలు అనుకూలంగా రావడం లేదు. రోజురోజుకు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడంతో పోలీసులు కఠిన వైఖరి అవలంభిస్తున్నారు. నిత్యం శ్వాస నిర్ధారణ పరీక్షలు చేసి తాగి వాహనం తోలుతున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నారు. మద్యం ఆరోగ్యానికి ముప్పు అని మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదమని నిత్యం వివరిస్తూనే ఉన్నారు. అయినా ఎవరు అవలంభించడం లేదు. పెద్దలు యువత అక్షరాస్యులు నిరక్షరాస్యులు అందరూ ఇదే తీరును వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి ఇటువంటి పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం తాగి రోడ్లపైకి వాహనాలతో వస్తామంటే పోలీసులు ఇక కుదరదు పొమ్మంటున్నారు.

మొదట బుజ్జగింపులు తదుపరి కఠిన చర్యలు

మద్యం సేవించి వాహనాలు నడిపి నిబంధనలను అతిక్రమించవద్దని పోలీసులు సూచిస్తున్నారు. మరి కొన్నిచోట్ల కుటుంబ సభ్యులపైన ప్రమాణాల సైతం చేస్తున్నారు. బెదిరించినా భయపెట్టిన తీరు మారకపోతే కేసులు నమోదు చేస్తామంటున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి లైసెన్స్ వాహన పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు. మద్యం సేవించి ఒంటరిగా వాహనాన్ని నడుపుకుంటూ వెళితే వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అదే ఇద్దరు వ్యక్తులు వాహనంపై ఉంటే అందులో ఒకరు మద్యం సేవించకపోతే ఆ వ్యక్తి సొంత పూచికత్తుతో వాహనాన్ని అప్ప జెప్తున్నారు. ఆపై కోర్టులో హాజరుపరుస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు

- పీసీపల్లి ఎస్ఐ ఏ నాగేశ్వరరావు

మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందుకే మండల ముఖ్య కేంద్రాల్లో గ్రామాల్లో ఎప్పటికప్పుడు వాహనా లను విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుపడితే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం వీరికి జరిమానాలతో పాటు జైలు శిక్ష సైతం విధించే అవకాశం ఉంది. తద్వారా మండల ప్రజలందరూ మద్యం సేవించి వాహనాలు నడపకుండా సురక్షిత ంగా గమ్యస్థానాలకు చేరాలని కోరుకుంటున్నాను.

వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ

విశాలాంధ్ర - పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఇడుపులపాడు ఆసరా వృద్ధాశ్రమంలోని స్త్రీలకు నాగబైరు వంశీకృష్ణ, గాయత్రీ దంపతుల మొదటి వివాహ వార్షికోత్సవ0 సందర్భంగా చీరలు,పండ్లు,స్వీట్లు అందజేశారు. అందరికీ డాక్టర్ ఎస్. వ రత్నాకర్ రావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశ్రయం పొందుతున్న వారందరూ నియమనిష్టలతో మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఆశ్రమ నిర్వాహకులు రోటరీ క్లబ్ వారికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ శివ రత్నాకర్ రావు , కార్యదర్శి పంబిసదానంద రెడ్డి ,కోదూరు సుబ్రహ్మణ్య చారి , పాబోలు వెంకన్న ,పోలిశెట్టి చంద్రం ,భవనం శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - పర్చూరు : శంకర కంటి ఆసుపత్రి పెద కాకాని గుంటూరు వారి సహకారంతో చిన్మయా మిషన్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్విహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 360 మందికి కంటి శుక్లముల పరీక్షలు నిర్వహించగా 262 మంది శస్త్ర చికిత్సకు ఎన్నిక అయ్యారు. వీరు అందరికి శంకర కంటి ఆసుపత్రి లో ఉచితంగా ప్రయాణం , భోజన వసతులతో శుక్లముల శస్త్ర చికిత్స నిర్వహిస్తామని నిర్వాహకులు పాబోలు ఉదయ భాస్కర్ చెప్పారు . వారి తల్లి తండ్రులు పాబోలు రాధా కృష్ణ మూర్తి ఇందిరాదేవి గార్ల జ్ఞాపకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఉదయ భాస్కర్ తెలియ చేసారు. ఈ శిబిరంలో డాక్టర్ షాయిజా, డాక్టర్ మెహబూబ్, పి ఆర్ ఓ నాగబాబు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. శిబిరంలో కాసా అజయబాబు , కొసనా వెంకటేశ్వర్లు, కటారి సత్యం , తాటి లింగేశ్వరరావు, గుండిమెడ ఆంజనేయ రావు, కొత్తూరి వెంకటేశ్వరరావు , సుబ్బారావు ,దుర్గ ప్రసాద్, రావి నాగయ్య, అమర్ బాబు, శంకర్ , రోటరీ సభ్యులు సేవలు అందించారు.

రేంజర్ల రాజేష్‌ను కలిసిన తిరువీధుల

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ప్రజా గాయకుడు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో ఎస్సీ ఎస్టీ బీసీ ప్రజలను తన పాటలతో చైతన్యపరిచి అంబేద్కర్ రాజ్యాంగం ఫలాలను అనుభవించుటకు నిరంతరం తెలంగాణ ఆంధ్ర ప్రాంతాలలో తిరుగుతూ చైతన్య పరుస్తున్న రెంజర్ల రాజేష్‌ని ప్రముఖ న్యాయవాది తిరువీధుల శంకర్ ప్రసాద్ ఆదివారం కలిశారు. బాపట్లలో ప్రజా కార్యక్రమానికి వచ్చిన రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దృశాలువా, పుష్ప గుచ్చాలతో ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, బడుగు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములతో వర్షం కురిసింది. దీంతో బాపట్ల మండలం మురు కుండపాడు గ్రామానికి చెందిన రవీంద్రకు చెందిన వరికుప్ప దగ్ధమైంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట దగ్ధమవటంతో రైతు కుటుంబం కన్నీరుమున్నీ రవుతున్నారు. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాథబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులతో మండల అభివృద్ధికి సంబంధించి శాఖ పరమైన అంశాల పై సమీక్ష జరుగుతుందని చెప్పారు.